సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 24 | జనవరి | 2025



జాబ్‌మేళాతో అవకాశాలు
ఉపాధి కల్పన శాఖ అధికారులు నిర్వహించే జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. - IIలో▸



యూపీఎస్‌కు వ్యతిరేకంగా పోరాడాల్సిందే..
యూపీఎస్‌కు వ్యతిరేకంగా చట్టసభల్లో పోరాడాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
$31^0/15^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ సాధారణంగా ఉంటుంది. రాత్రి సమయంలో మంచు కురుస్తుంది.

రక్షిద్దాం.. చదివిద్దాం!

నేడు జాతీయ బాలికా దినోత్సవం

ఆడపిల్లలను కాపాడుకుందాం

ఆడపిల్ల అనగానే సమాజంలో ఇప్పటికీ చిన్నచూపే. వంశోద్ధారకుడి కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు.. కడుపులోని పిండం ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యకు పాల్పడుతున్నారు. పుట్టిన తర్వాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలు ఎన్నో. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్' పేరుతో కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగా 2008 నుంచి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నేడు (శుక్రవారం) జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - సాక్షిప్రతినిధి, వరంగల్/కాజీపేట అర్బన్/మహబూబాబాద్ అర్బన్/వరంగల్ క్రైం

ప్రభుత్వ తాజా నివేదిక ప్రకారం ప్రతీ వెయ్యి మంది మగ పిల్లలకు ఆడపిల్లలు
- భూపాలపల్లి: 913
- వరంగల్: 932
- హనుమకొండ: 912
- ములుగు: 971
- జనగామ: 935
- మహబూబాబాద్: 903

	వరంగల్	హనుమకొండ	జయశంకర్	జనగామ	ములుగు	మానుకోట
2023	18	10	09	14	15	35
2024	07	43	18	13	09	50

అధికారులు అడ్డుకున్న బాల్య వివాహ కేసుల వివరాలు

- కఠిన కేసులు నమోదు చేస్తున్నా ఆగని లైంగికదాడులు
- వారి సంరక్షణకు తోడ్పాటునందిస్తున్న ఐసీడీఎస్, సఖి వన్‌స్టాప్ కేంద్రాలు
- నేటినుంచి మార్చి వరకు 'బేటీ బచావో- బేటీ పడావో' నినాదంతో దశాబ్ది ఉత్సవాలు

0-6 సంవత్సరాల వయసు బాలికలు

హనుమకొండ	జేఎస్.భూపాలపల్లి	జనగామ	మహబూబాబాద్	వరంగల్	ములుగు
46,950	18,743	25,711	38,742	34,893	14,563

ఆడపిల్లే.. ఇంటికి వెలుగు. బుడిబుడి అడుగులు.. గజ్జల సవ్వడితో నట్టింట్లో నడిస్తే ఆ కుటుంబం సిరిసంపదలతో కళకళలాడుతుంది. 'ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలను చదివించండి' అనే నినాదంతో 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది బాలికా దినోత్సవం నేపథ్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' దశాబ్ది ఉత్సవాలను మార్చి 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 'నేను సైతం ఆడ పిల్లల రక్షణలో భాగస్వామ్యం నా బాధ్యత' అంటూ హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, గోడపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై సంతకం చేశారు.


నేనుసైతం: సంతకం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

విద్యతోనే సమాజంలో గుర్తింపు..



ఆడపిల్లలు విద్య నభ్యసిస్తేనే ఆ కుటుంబం బాగు పడుతుంది. సమాజంలో మంచి గుర్తింపు వస్తుంది. బాలికా విద్య కోసం ప్రభుత్వాలు చేస్తున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ముందుకెళ్లాలి. –విజయకుమారి, జీసీడీఓ, మానుకోట

బాలికలపై చిన్నచూపు వద్దు..



మా టీచర్లు నాకు చదువుతోపాటు కబడ్డీ కూడా నేర్పిస్తున్నారు. నేను జాతీయ స్థాయి కబడ్డీకి ఎంపికయ్యాను. భవిష్యత్‌లో బాగా చదువుకుని ఉన్నతంగా స్థిరపడతాను. బాలికలపై చిన్నచూపు చూడొద్దు. – బానోత్ దివ్య, విద్యార్థిని, కేజీబీవీ

సంరక్షణకు సఖి, స్త్రీ సంక్షేమశాఖ
ఆడపిల్లల రక్షణ, సంరక్షణలో సఖి వన్‌స్టాప్ సెంటర్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు ఎంతో కృషి చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రతి జిల్లాకేంద్రంలో సఖి వన్‌స్టాప్ సెంటర్లు పని చేస్తున్నాయి. వివక్ష, ఇతరత్రా పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా నిర్వాహకులు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ 181ను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. ఆడపిల్లల హక్కులు, రక్షణ చట్టాలపై స్కూల్స్, కాలేజీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా బాలికల సంరక్షణ, రక్షణకు గాను స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామ, మండల, పట్టణ, జిల్లా స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. బాల్య వివాహ నిషేధ అధికారిని నియమించి బాల్య వివాహాలు జరగకుండా చర్యలతో పాటు వివరాలను సేకరించేందుకు చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 అందుబాటులో ఉంది.

ఆగని బాల్యవివాహాలు



సాక్షి, వరంగల్: ఆడపిల్లలు చదువులో రాణిస్తూ అన్నిరంగాల్లో దూసుకుపోయి సత్తా చాటుతున్నా ఇంకా పలుచోట్ల బలవంతపు వివాహాలు చేస్తూ బలి చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఇప్పటికీ తరచూ బాల్య వివాహాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఆరు జిల్లాల్లో 2023 సంవత్సరం 106 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకోగా.. గత ఏడాది ఏకంగా 140 వరకు నిరోధించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పూలబాటతో స్వాగతం

శిరు ఆదర్శం



కేసముద్రం: ఆడపిల్ల పుడితే మాకొద్దంటున్నా ఈ రోజుల్లో మా ఇంట మహాలక్ష్మి పుట్టిందని ఆనందం వ్యక్తం చేస్తూ.. ఆ తల్లీబిడ్డలకు పూలబాట వేసి అత్తారిల్లు స్వాగతం పలికింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామానికి పొడకంటి క్రాంతి కుమార్, సుమ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. గత ఏడాది నవంబర్‌లో సుమకు మూడో కాన్పులో ఆడపిల్ల జన్మించింది. ఆమె డిశ్చార్జ్ అయి ఇంటికి రాగా రకరకాల పూలతో బాటవేసి అపూర్వ స్వాగతం పలికారు.



ఆడపిల్ల.. లక్ష్మీదేవి..
నెహ్రూసెంటర్: ఆడపిల్ల పుట్టడంతో ఆ ఇంట్లో లక్ష్మీదేవిగా భావిస్తూ వినూత్న వేడుకకు శ్రీకారం చుట్టారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కృష్ణాకాలనీకి చెందిన ప్రశాంత్-వర్ష దంపతులకు తొలి సంతానంగా ఆడపిల్ల జన్మించింది. తమ ఇంట లక్ష్మీదేవి జన్మించిందని గత ఏడాది అక్టోబర్‌లో రూ.5 కాయిన్స్ (రూ.25 వేలు)తో అలంకరించి మొదటి నెల వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి కనుల పండువగా జరుపుకున్నారు.

లైంగికదాడులు

కలవరం



బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజాన్ని కలవరపరుస్తున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2023 సంవత్సరంలో పోక్సో కేసులు 209 నమోదు కాగా.. అందులో 204 కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేశారు. నాలుగు కేసుల్లో శిక్షలు పడ్డాయి. 2024 సంవత్సరంలో 166 కేసులు నమోదు కాగా.. 105 కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 7 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ములుగు జిల్లాలో-1, భూపాలపల్లి జిల్లాలో-2 పోక్సో కేసులు నమోదు కాగా.. మహబూబాబాద్ జిల్లాలో-29 కేసులు నమోదయ్యాయి. దీంతోపాటు 12 లైంగికదాడి ఘటనలు జరిగాయి.

న్యూస్‌రీల్

ఓపెన్ అడ్మిషన్ల గడువు పొడిగింపు
విద్యారణ్యపురి : తెలంగాణ సార్వత్రిక విద్యాలయం ద్వారా ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు అడ్మిషన్ల గడువును పొడిగించారు. ఈనెల 27నుంచి 29వతేదీ వరకు అడ్మిషన్లకు చివరి అవకాశం కల్పించినట్లు డీఈఓ వాసంతి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ సదానందం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆసక్తిగల అభ్యర్థులు తమ సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు అడ్మిషన్ ఫీజును డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ ఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా చెల్లించి రశీదు పొంది సంబంధిత అధ్యయనకేంద్రాల్లో అడ్మిషన్ ప్రింట్ అవుట్‌ను ఈనెల 29వ తేదీలోగా సమర్పించాలన్నారు. పూర్తివివరాలకు 93460 20003, 8008403631లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
కాజీపేట అర్బన్ : దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన ఉపాధికి, పునరావాస పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి జయంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ.50వేల సబ్సిడీతో రుణం అందజేయనున్నట్లు వెల్లడించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు 13 యూనిట్లు మంజురయ్యాయని, అర్హులైన దివ్యాంగులు ఫిబ్రవరి 2వ తేదీలోగా ఆన్‌లైన్ www.tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి : కలెక్టర్



వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్‌ఫూల్, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని జిమ్నాస్టిక్ హాల్, ఇండోర్ స్టేడియాలను గురువారం కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్‌ఫూల్, ఇండోర్, జిమ్నాస్టిక్ హాల్‌కు కావాల్సిన వసతులను డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. వెంటనే చేయాల్సిన మరమ్మతులు, వసతుల కల్పనకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

బల్దియా అద్దె షటర్లకు వేలం
వరంగల్ అర్బన్ : బల్దియాకు చెందిన కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో అద్దె షటర్లకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లోని 11 నుంచి 14, 17 నుంచి 23 వరకు, పోచమ్మమైదాన్ జంక్షన్‌లోని 4, 6 షటర్లకు వ్యాపారులు రూ.3వేల నుంచి రూ.1.07లక్షలకు వరకు వేలంపాటలో కైవసం చేసుకున్నారు. రెండేళ్ల కాలపరిమితితో ఒప్పందం మేరకు జరిగే అద్దె షటర్ల నుంచి ప్రతినెలా రూ.4.99 లక్షలు ఆదాయం సమకూరుతుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జోనా, టీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ టీచర్ల సర్వీస్ బుక్స్ పరిశీలన
విద్యారణ్యపురి : వివిధ జిల్లాలనుంచి హనుమకొండ జిల్లాకు కేటాయించిన స్పౌజ్ టీచర్లకు డీఈఓ కార్యాలయంలో గురువారం సర్వీస్ బుక్స్‌ను పరిశీలించారు. ఆయా జిల్లాలనుంచి రిలీవ్ అయిన స్పౌజ్ టీచర్లు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో రిపోర్టు చేశారు. మొత్తం 143 మంది స్పౌజ్ టీచర్లను కేటాయించగా, 101 మంది వచ్చారు. డీఈఓ పర్యవేక్షణలో పీజీహెచ్‌ఎంలతో కూడిన నాలుగు బృందాలు రికార్డులను పరిశీలించాయి. మిగతా వారికి నేడు (శుక్రవారం) పరిశీలన చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాకే కౌన్సెలింగ్ నిర్వహించి సీనియారిటీ ప్రాతిపదికన పోస్టింగ్‌లు కేటాయించనున్నారు.

ఆత్మహత్యాయత్నం
హన్మకొండ అర్బన్ : హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన 108 వాహనం, కలెక్టరేట్ సిబ్బంది అతడిని నిలువరించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన బైరి రాజేందర్‌ను అతని కుమారుడు కార్తీక్ శివనగర్‌లో ఉన్న రేకుల ఇంటిని తన పేరుపై మార్చాలని తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నాడు. ఇదేవిషయంపై స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వాపోయాడు. అనంతరం బాధితుడిని సుబేదారి పోలీసులకు అప్పగించారు. సకాలంలో స్పందించిన 108, కలెక్టరేట్ సిబ్బందిని అధికారులు అభినందించారు.

బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు
మంత్రి కొండా సురేఖ


ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ : సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని ఆమె నివాసంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని మందలించారు. 26వ తేదీనుంచి అమలు చేస్తున్న నూతన పథకాలు అర్హులకు అందేలా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నందున ఎవరూ ఆందోళన చెందొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి సురేఖ శంకుస్థాపన
రామన్నపేట/ఖిలావరంగల్ : నగరంలోని 22, 35వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు గురువారం రాష్ట్ర మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. 22వ డివిజన్‌లోని మర్రి వెంకటయ్య కాలనీలో రూ.2.60 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ, సీసీ రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. 35వ డివిజన్ ఏసీరెడ్డినగర్‌లో స్మార్ట్ సిటీ నిధుల కింద రూ.2.90కోట్లతో చేపట్టే పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత బల్దియా సాధారణ కింద రూ.30లక్షల నిధులతో నిర్మించే అంతర్గత రహదారుల పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్లు కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పథకాలను అడ్డుకునే వారిని కట్టేసికొట్టండి

- పదేళ్లు పేదలకు నరకం చూపిన బీఆర్‌ఎస్
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో మేయర్ సుధారాణి తదితరులు

హన్మకొండ చౌరస్తా: ప్రజలను రెచ్చగొడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడ్డుతగిలే వారిని సభావేదికల వద్దే కట్టేసి కొట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హనుమకొండలోని అశోకా కన్వెన్షన్‌హాల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను, ప్రతీ హామీని నాలుగు నెలలు ఆలస్యమైనా నెరవేరుస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు పదేళ్లు దున్నపోతుల్లా ప్రజలను దోచుకు తిన్నది తప్ప చేసిన అభివృద్ధి ఏంలేదన్నారు. పదేళ్లలో చేయలేని అభివృద్ధిని తాము చేస్తుంటే ఓర్చుకోలేక , కాంగ్రెస్ శ్రేణులకే పథకాలంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు పేదలకు బీఆర్‌ఎస్ నరకం చూపెడితే, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. దమ్ముంటే బీఆర్‌ఎస్ నాయకులు అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. త్వరలోనే మాస్టర్‌ప్లాన్ కాపీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అవుతుందని , డిప్యూటీ మేయర్, కోఆప్షన్ సభ్యుల నియామకంపై త్వరలో కౌన్సిల్ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని విలేకరుల అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, జక్కుల రవీందర్, అబూబక్కర్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి : మేయర్ గుండు సుధారాణి
వరంగల్ అర్బన్ : నగరంలోని ఆయా డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. గురువారం బల్దియా కార్యాలయంలో అభివృద్ధి పనులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నిర్వహణ పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాస్, సంతోష్‌బాబు, ఏఈ సౌజన్య పాల్గొన్నారు.

నేడు సైబర్ నేరాలపై 'ఫోన్ ఇన్'



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోజురోజుకూ సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతోంది. సైబర్ నేరగాళ్లు విభిన్న కోణాల్లో ప్రజలను బురిడీ కొట్టించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలనుంచి తప్పించుకోవడం ఎలా? నేరగాళ్లు ఎలాంటి విధానాలు అవలంబిస్తున్నారు.. నేరాలు ఏవిధంగా ఉంటున్నాయి.. ఒకవేళ మోసపోతే ఎవరిని సంప్రదించాలి.. రికవరీ ఎలా?.. తదితర సందేహాలను నివృత్తి చేయడానికి 'సాక్షి' ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్‌తో శుక్రవారం ఫోన్‌ఇన్ కార్యక్రమం ఏర్పాటుచేసింది. నేరుగా ఆయనకే ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

నేడు (శుక్రవారం)
సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ :
87126 65552

నేటితో ముగియనున్న వార్డుసభలు
వరంగల్ అర్బన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకోసం గ్రేటర్ వరంగల్‌లో నిర్వహిస్తున్న వార్డుసభలు నేటితో ముగియనున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల కోసం బుధవారం దరఖాస్తులు పెద్ద ఎత్తున నమోదయ్యాయి. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 8 డివిజన్లలో గురువారం వార్డు సభలు కొనసాగనున్నాయని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. మూడో రోజు 28 డివిజన్లలో వార్డుసభల్లో రేషన్ కార్డులకు 10,902, ఇందిరమ్మ ఇళ్ల కోసం 5,144 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

నేడు వార్డుసభలు జరిగే ప్రాంతాలు..

డివిజన్	ప్రాంతం
31	న్యూశాయంపేట నెహ్రూ విగ్రహం
50	రెవెన్యూ కాలనీ
57	అంబేద్కర్ భవన్
58	టీఎన్‌జీఓస్ కాలనీ వాటర్ ట్యాంక్
6	లష్కర్ బజార్ శ్రీలక్ష్మి బజారు
9	అంబేద్కర్ భవన్, మాల కమ్యూనిటీ హాల్, మైసమ్మ టెంపుల్
46	రాంపూర్ గ్రామ పంచాయతీ ఆఫీస్
65	చింతగట్టు గ్రామపంచాయతీ ఆఫీస్

పదోన్నతి కల్పనలో వివక్ష

- టీజీఎన్‌పీడీసీఎల్‌లో ఏఈలకు తప్పని ఎదురుచూపులు
- ఏడీలకు డీఈలుగా, డీఈలకు ఎస్‌ఈలుగా పదోన్నతి
- ఏఈల ప్రమోషన్లలో యాజమాన్యం నిర్లక్ష్యం



హన్మకొండ: క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న తమపై టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం వివక్ష చూపుతోందని విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ) ఆరోపిస్తున్నారు. ఇటీవల అసిస్టెంట్ సబ్ డివిజనల్ (ఏడీ)లకు డివిజనల్ ఇంజనీర్ (డీఈ)లుగా, డివిజనల్ ఇంజనీర్లకు సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా(ఎస్‌ఈ) పదోన్నతి కల్పించిన యాజమాన్యం ఏఈలపై సవతి తల్లి ప్రేమ చూపుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా యాజమాన్యం పదోన్నతిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాకు చెందిన సీనియర్ ఏఈలు తమకు పదోన్నతి ఎప్పుడు లభిస్తుందోనని వేచి చూస్తున్నారు. పదోన్నతికి అర్హత ఉన్న చాలా మంది ఏఈలు రెండు, మూడు నెలల్లో పదవీ విరమణ పొందేందుకు సిద్ధంగా ఉన్నారు. గతంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీ)లకు డివిజనల్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించడంలో ఇలాగే జాప్యం జరగడంతో డీఈలుగా రిటైర్ కావాల్సిన వారు యాజమాన్య నిర్లక్ష్యంతో ఏడీలుగా పదవీ విరమణ పొందారు. వచ్చింది. రెండేళ్ల క్రితం కల్పించాల్సిన పదోన్నతులకు ఓ నాయకుడు అడ్డంకులు సృష్టించిన క్రమంలో ఇటీవల యాజమాన్యం పదోన్నతి కల్పించినా అప్పటికే డీఈలు కావాల్సిన అధికారులు రిటైరయ్యారు. తమకు రావాల్సిన అవకాశాలను అడ్డుకోవడంపై మండిపడుతున్నారు. తాము పదోన్నతి పొందకుండానే రిటైర్ కావాలా అని ప్రశ్నిస్తున్నారు. ఏఈలకు పదోన్నతి కల్పించకుండా జాప్యం చేయడంలో యాజమాన్యం వైఖరి ఏంటో స్పష్టంగా చెప్పడం లేదు. కొన్ని ఇంజనీర్ల అసోసియేషన్ నాయకుల వెళ్లి పదోన్నతిపై యాజమాన్యం వద్ద ప్రస్తావిస్తే రెండు, మూడ్రోజుల్లో అని చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓ అసోసియేషన్ నాయకుడికి ప్రాధాన్యత ఇవ్వడంలో యాజమాన్య వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. మిగతా నాయకులు పదోన్నతి కావాలని కోరుతుంటే ఆ ఒక్కరు మాత్రమే అడ్డంకులు కలిగిస్తున్నారని ఎన్పీడీసీఎల్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఏఈలకు పదోన్నతి కల్పిస్తేనే సబ్ ఇంజనీర్ల పదోన్నతికి లైన్ క్లియర్ అవుతుంది. ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం స్పందించి తమకు పదోన్నతి కల్పించాలని ఏఈలు కోరుతున్నారు.

బ్యాంకుల భద్రతపై దృష్టి సారించాలి

- బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం
- సీపీ అంబర్ కిషోర్ ఝా


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం : వినియోగదారుల సొమ్ముతోపాటు భద్రతపై బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. ట్రైసిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులతో గురువారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. వినియోగదారుల సొమ్ము భద్రతకు తీసుకుంటున్న చర్యలను బ్యాంకర్లు వివరించారు. అనంతరం ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను ప్రస్తావిస్తూ బ్యాంకర్ల తప్పిదాలను సీపీ వివరించారు. బ్యాంకులతోపాటు ఏటీఎంల భద్రతకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడంతోపాటు విధుల నిర్వహణను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. ముఖ్యంగా సీసీ కెమెరాల పనితీరుకు ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, వీలైనంత వరకు బ్యాంక్ లోపల, బయట సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని చెప్పారు. సీసీ కెమెరాల దృశ్యాలను క్లౌడ్ స్టోరేజీలో భద్రపర్చాలని, బ్యాంక్ పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు బల్బులను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం నూతన టెక్నాలజీ అలారంలు, అధిక భద్రత కలిగిన అల్మారాలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. బ్యాంక్‌లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు జితేందర్, తిరుమల్, దేవేందర్ రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

● తొలి సెషన్‌కు 1,223, రెండో సెషన్‌కు 1,223 మంది హాజరు

విద్యారణ్యపురి : దేశంలోని అత్యున్నత జాతీయ విద్యాసంస్థలు ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు హనుమకొండ, వరంగల్‌లో కలిపి 5 కేంద్రాల్లో గురువారం కూడా కొనసాగాయి. ఉదయం మొదటి సెషన్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు 1,255 మంది అభ్యర్థులకు 1,223 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్ లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6గంటలవరకు జరిగిన పరీక్షలకు 1,255 మంది అభ్యర్థులకు 1,223 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ కె. శ్రీలతారెడ్డి తెలిపారు. రెండు గంటల ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఉదయం సెషన్‌లో 8.30గంటలకు,రెండోసెషన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. హాల్‌టికెట్ అడ్మిట్ కార్డు, పాస్‌ఫొటోలు, ఒరిజనల్‌గుర్తింపు కార్డును పరిశీలించాకే అనుమతిస్తున్నారు.

హోమ్ స్టే నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం


వరంగల్: పర్యాటకుల విడిది కోసం హోమ్ స్టే నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ధర్తీ ఆబ జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' పథకంలో భాగంగా పర్యాటక ప్రాంతాలు, గ్రామీణ గిరిజన ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు ఇంట్లోనే తాత్కాలిక నివాసం కల్పించేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. వారికి స్థానికంగా నివాసం కల్పించడమే కాకుండా.. ఆహారం అందించి పర్యాటక అనుభూతిని కలిగించాలని.. పర్యాటక ప్రదేశాలున్న ట్రైబల్ విలేజ్‌లను అభివృద్ధి చేయడంలో భాగంగా హోమ్ స్టే నిర్వహణను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారం తెలంగాణ టూరిజం హోం స్టే ఎస్టాబ్లిష్‌మెంట్ సదుపాయాల కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పర్యాటకులకు అన్ని సదుపాయాలతో కనీసం ఒక గది మొదలు పది గదుల వరకు స్టే ఇవ్వగలిగి ఉండాలని, హోమ్ స్టే విధి విధానాలు, ఇతర మరిన్ని వివరాల కోసం www.telanganatourism. gov. in వెబ్‌సైట్‌లో, హనుమకొండ కలెక్టరేట్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో లేదా 98669 19131లో సంప్రదించాలని ఆయన కోరారు.

దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

కాశీబుగ్గ సెంటర్: వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు సేవ, వ్యాపారాల్ని స్థాపించుకుని జీవనోపాధి పొందాలనుకునే దివ్యాంగులు ఉపాధి, పునరావాస పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి.రాజమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఈపథకం కింద జిల్లాకు 13 యూనిట్ల ద్వారా రూ.6.50 లక్షల సబ్సిడీ మంజూరు చేసినట్లు, ఆపథకం ద్వారా లబ్ధిపొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. www.tsobmms.cgg.gov వెబ్‌సైట్ ద్వారా ఈనెల ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

జాబ్‌మేళాతో ఉద్యోగావకాశాలు..

ప్రైవేట్ కంపెనీతో పాటు విదేశాల్లో కూడా..
● ఈఏడాది 81 జాబ్ మేళాల ద్వారా 926 మందికి ప్లేస్‌మెంట్
● నిరుద్యోగులు ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌లో సంప్రదించాలి: అధికారుల సూచన



కాశీబుగ్గ సెంటర్: ఉద్యోగావకాశాల కోసం అన్వేషిస్తున్న నిరుద్యోగ యువతీయువకుల కోసం ఉపాధి కల్పన శాఖ అధికారులు అవకాశాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రైవేట్ రంగం కంపెనీల్లో విద్యార్హతను బట్టి ఉద్యోగం కల్పిస్తున్నారు. ఇందుకు ఉపాధి కల్పన శాఖలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించి వరంగల్, హనుమకొండతోపాటు హైదరాబాద్, విదేశాల్లోని ప్రముఖ కంపెనీలలో గుర్తింపు పొందిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కాంమ్) సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నారు. బ్యాంకింగ్ రంగం, ఫార్మ, వైద్య రంగంలో ఇప్పటి వరకు వందల మందికి ప్లేస్‌మెంట్ కల్పించి ఉద్యోగావకాశాలు కల్పించారు. టామ్‌కాంమ్ సంస్థ ద్వారా ఇప్పటి వరకు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, లండన్, జర్మనీ, సింగపూర్, జపాన్ దేశాలకు పంపారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగావకాశాలతో పాటు విదేశాలలో పనిచేయడానికి ఎదురు చూసే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీయువకులు వెంటనే జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారులను సంప్రదిస్తే ఉద్యోగం లభించే అవకాశం ఉందని శాఖ జిల్లా అధికారి ఉమారాణి తెలిపారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదు చేసుకున్న వారు ఇలా..

ఉద్యోగావకాశాల కోసం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇప్పటి వరకు నమోదు చేసుకున్న నిరుద్యోగులు 13,191 మంది ఉన్నారు. ఇందులో ఎస్సీలు 3,545, ఎస్టీలు 352, బీసీలు 8,470, ఓసీలు 824 మంది ఉన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో ఇప్పటి వరకు 81 జాబ్ మేళాలు నిర్వహించగా 926 మంది అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు లభించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రైవేట్ రంగంలో కాకుండా 2024 డీఎస్సీ ద్వారా కూడా 223 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు.

విదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం



ఎంప్లాయ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. ప్రతి నెల జాబ్ మేళా నిర్వహించి విద్యార్హతల ఆధారంగా ఆయా సంస్థలకు కావాల్సిన మ్యాన్‌పవర్‌ను అందించి అవకాశాలు కల్పిస్తున్నాం. రాష్ట్రంలోనే కాకుండా విదేశాలకు కూడా టాంమ్‌కామ్ సంస్థ ద్వారా ఉద్యోగం లభిస్తుంది. జాబ్‌మేళా నిర్వహించినప్పుడు ఆసక్తి గల వారు విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలి.

– సీహెచ్.ఉమారాణి, ఉపాధి కల్పన శాఖ అధికారి, వరంగల్ జిల్లా

యూపీఎస్‌కు వ్యతిరేకంగా పోరాడాల్సిందే

● టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ



మాట్లాడుతున్న స్థిత ప్రజ్ఞ

హన్మకొండ అర్బన్ : కేంద్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని పీఎఫ్ ఆర్డీఏ ద్వారా ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాబోతున్న మరో మోసపూరిత పథకమే యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్) అని, దీనిని వ్యతిరేకించాలంటే చట్టసభల్లో పోరాడాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ తెలిపారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ కార్యాలయంలో యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, విశిష్ట అతిథిగా సీపీఎస్ వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కొలిపాక వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న కొలిపాక వెంకటస్వామిని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు తప్పకుండా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం సంఘం హనుమకొండ జిల్లా నూతన సంవత్సర –2025 క్యాలెండర్, సీపీఎస్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మేనిఫెస్టోను అతిథులు ఆవిష్కరించారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుచ్చన్న, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్, జిల్లా నాయకులు ఆవునూరి రవి, నాగముని, లక్ష్మణ మూర్తి, రవీందర్‌రెడ్డి, హరికుమార్, రాజు, సరళారాణి, ఉమారాణి, ఆనంద్ కుమార్, అక్బర్, రఘుపతి, శ్రీకాంత్, శంకర్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, నాయకులు

కాశీబుగ్గ సెంటర్: పీఆర్సీ, పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ ఎమ్మార్సీ కార్యాలయంలో ఖిలావరంగల్ ఎంఈఓ ప్రసాద్, వరంగల్ ఎంఈఓ అశోక్ కుమార్ చేతుల మీదుగా క్యాలెండర్, డైరీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ముజాహిద్ అలీ, జిల్లా కార్యదర్శి బి.పూర్ణచందర్, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మనోజ్, వరంగల్, ఖిలావరంగల్ మండల బాధ్యులు ఉమేశ్, హరిప్రసాద్, దినేశ్, నారాయణ రెడ్డి, జహీరొద్దీన్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు గిడుగు జాతీయ పురస్కారం



కాశీబుగ్గ సెంటర్: వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పోగు అశోక్‌కు గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతి వేడుకల సందర్భంగా 'గిడుగు జాతీయ పురస్కారం' లభించింది. బుధవారం హైదరాబాద్‌లోని సందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి, సేవా కార్యక్రమాలు చేసిన వారికి గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ వారు జాతీయ పురస్కారాలు అందించారు. అందులో భాగంగా ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తునే సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్‌గా తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తునందుకు ఈ పురస్కారం అందజేసినటుల అశోక్ తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ శ్రీధర్, స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమేశ్, తోటి ఉపాధ్యాయులు అతడిని అభినందించారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

● హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్ నీలిమాదేవి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధ్యాపకులు

న్యూశాయంపేట : శంభునిపేట, దూపకుంటరోడ్డులో గల వరంగల్–2 (బాలికలు), మైనార్టీ గురుకులంలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తాళ్ల నీలిమాదేవి పేర్కొన్నారు. గురువారం గురుకుల ఆవరణంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గురుకులంలో అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన, రుచికరమైన భోజనం, అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. మైనార్టీ కోటాలో ఫస్టకం ఫస్ట్ బేసిస్ అడ్మిషన్, నాన్ మైనార్టీ కోటాలో లక్కీడి ప్ ద్వారా సీట్ల భర్తీ జరుగుతుందని ఆమె వెల్లడించారు. అర్హత గల వారు వెబ్‌సైట్ టీఎంఆర్‌ఈఐఎస్.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో పూర్తి వివరాలతో వచ్చే నెల 28వ తేదిలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు శంభునిపేట దూపకుంటరోడ్‌లో ఉన్న గురుకులంలో సంప్రదించాలన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ కల్పించాలని బైఠాయింపు

● పెట్రోల్ క్యాన్‌తో నిరసన

కేయూ క్యాంపస్: తమకు పీహెచ్‌డీ అడ్మిషన్ కల్పించాలని ఇద్దరు అభ్యర్థులు కాకతీయ యూనివర్సిటీలో వీసీ చాంబర్‌లో బైఠాయించారు. పెట్రోల్‌తోకూడిన క్యాన్ పట్టుకొచ్చి నిరసన తెలిపారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డి కథనం ప్రకారం.. ఇద్దరు అభ్యర్థులు మంద నరేశ్, అనిల్ గురువారం వీసీ చాంబర్‌కు వచ్చి వీసీ ప్రతాప్‌రెడితో తమకు పీహెచ్‌డీ అడ్మిషన్ కల్పించాలని కోరారు. అయితే తాను వీసీగా బాధ్యతలు చేపట్ట కముందే పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిందని, ఇప్పుడు తన చేతిలో లేదని స్పష్టం చేశారు. అనంతరం వీసీ క్యాంపస్‌లోని లాడ్జ్‌కు వెళ్లిపోయారు. దీంతో నరేశ్, అనిల్ పెట్రోల్‌తోకూడిన క్యాన్‌తో వీసీ చాంబర్‌లోకి వెళ్లి బైఠాయించారు. దీనిపై రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా, కొంతకాలంగా తరుచూ పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని అడ్మినిస్ట్రేషన్ పరంగా తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని నరేశ్, అనిల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు.

ఘనంగా రబ్బానీ ఉర్సు

● ఖురాన్‌ను పఠించిన ముస్లింలు
● మతాలకతీతంగా దర్గాను దర్శించుకున్న భక్తులు



దర్గా ప్రాంగణంలో భక్తుల సందడి

ఖిలా వరంగల్ : కరీమాబాద్‌లోని హజ్రత్ మాషుఖ్ రబ్బానీ (రహమతుల్లా ఆలై) దర్గాలో ఉర్సు ఉత్సవాలు గురువారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా హైదర్ హిలాల్‌యొద్దీన్ ఖాద్రీ (నవీద్‌బాబా), సయ్యద్ అలీషా ఖాద్రీ (ఉబేద్‌బాబా) ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మతాలకతీతంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు ట్రిసిటీకి చెందిన లక్షలాది మంది భక్తులు ఉర్సు ఉత్సవాలకు తరలివస్తున్నారు.దీంతో దర్గా ప్రాంగణం జనంతో కిటకిటలాడుతోంది. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు ఖురాన్ పఠనం తోపాటు బెంగళూరుకు చెందిన ముస్లింలు ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు దర్గా ఎదుట ఫకీర్ల ప్రత్యేక విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి, ముస్లింలు ఎంఏ జబ్బార్, చంద్‌పాషా, గఫార్, దస్తగిరి, అమీర్ తదితరులు పాల్గొన్నారు. ఏసీపీ నందిరాం నాయక్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం నేతృత్వంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు.

బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్



నిందితురాలి వివరాలు వివరిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న మహిళను గురువారం అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. నిందితురాలి నుంచి సుమారు రూ.15.50 లక్షల విలువైన బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హనుమకొండ పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. వరంగల్‌లోని శివనగర్‌కు చెందిన కట్రోజు విజయ భర్త కార్పెంటర్‌గా పనిచేస్తూ వచ్చిన ఆదాయంతో మద్యానికి ఖర్చు చేస్తున్నాడు. పూట గడవడం కష్టంగా మారడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన వచ్చింది. దీంతో వస్త్రాల దుకాణాల్లో చీరల చోరీతో పాటు బస్సులు, రైళ్లు, ఆటోల్లో ఒంటరిగా ప్రయాణించే వారినే లక్ష్యంగా చేసుకొని బంగారు ఆభరణాల చోరీకి పాల్పడుతోంది. ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ, ములుగు, హసన్‌పర్తి, కొత్తగూడెం, ఖమ్మం పరిధిలో 14 చోరీలకు పాల్పడి పలుమార్లు జైలు జీవితం గడిపింది. జైలు నుంచి విడుదలైన అనంతరం ఎలాంటి మార్పు రాలేదు. కాగా, నాలుగు రోజు క్రితం హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగు నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసింది. చోరీ సొత్తును గురువారం విక్రయించేందుకు వెళ్తున్న క్రమంలో పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా చోరీ సొత్తు కనిపించింది. దీంతో విచారించగా నేరాలకు పాల్పడినట్లు నిందితురాలు అంగీకరించడంతో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

ఆదివాసీలు అవకాశాలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘు


హన్మకొండ : గిరిజనులకు వర్తించే విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని ఆదివాసీల్లోని తోటి తెగ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ అశోకా కాలనీలోని గిరిజన భవన్‌లో జరిగిన ఆదివాసీల సమావేశంలో రఘు మాట్లాడారు. ఆదివాసీల తొమ్మిది తెగలలో తోటితెగ ఒకటని అని ఉద్ఘాటించారు. గిరిజనేతరుల ప్రాబల్యంతో ఆదివాసీలు తమ అస్థిత్వాన్ని కోల్పోతూ ఎస్టీల్లో మైనార్టీలుగా మిగిలిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మత్తుకు బానిసైన యువత చదువును నిర్లక్ష్యం చేస్తూ నిరుద్యోగులుగా మిగిలిపోయి రాజకీయ పార్టీల జెండాలను మోస్తు బానిసలుగా మిగిలిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు.స్పోర్ట్స్ విద్యాలయాల్లో కోచ్‌లు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే కోచ్‌లను నియమించాలని కోరారు. మంత్రి సీతక్క చొరవ చూపి, సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.

292 గ్రామ, వార్డుసభల నిర్వహణ

వరంగల్: వరంగల్ జిల్లా పరిధిలో గురువారం నాటికి 262 గ్రామ, వార్డు సభలు నిర్వహించినట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 206 గ్రామ సభలు, వరంగల్ కార్పొరేషన్, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల్లో 86 వార్డు సభలు నిర్వహించినట్లు తెలిపారు. ఈసభల్లో నాలుగు పథకాల కోసం మొత్తం 47,470 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఇందులో రేషన్‌కార్డుల కోసం 25,333, ఇందిరమ్మ ఇళ్ల కోసం 16,702, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 4,987, రైతు బంధు కోసం 448 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

గంగమ్మ గుడి ఆవరణలో మొసలి

● పట్టుకుని అధికారులకు అప్పగించిన గ్రామస్తులు



గుడి ఆవరణలో మొసలి

గూడూరు: మండలంలోని కొల్లాపురం గ్రామ శివారులోని గంగమ్మ గుడి ఆవరణలో గురువారం ఓ మొసలి సంచరించడానికి సమీప రైతులు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకున్న గ్రామస్తులు మొసలిని బంధించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. వారు ఆ మొసలిని తీసుకెళ్లి ఖానాపురం, కొత్తగూడ మండలాల పరిధిలోని పాకాల సరస్సులో వదిలినట్లు గూడూరు ఫారెస్ట్ రేంజర్ సురేశ్ తెలిపారు.

మరణంలోనూ వీడని స్నేహం..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్నేహితులు మృతి
● రెండు రోజుల వ్యవధిలో కన్నుమూత
● ఈనెల 19న తెల్లవారుజామున ఘటన



రహీం(ఫైల్)



అర్బాజ్(ఫైల్)

కాళేశ్వరం : చిన్నప్పటి నుంచి వారు ప్రాణమిత్రులు. ఒకరిని విడిచి మరొకరు ఉండేవారుకాదు. పాఠశాలకైనా.. ఆటలకైనా.. పనులకైనా.. ఇలా ప్రతీ చోటుకు కలిసే వెళ్లేవారు. ఇంత ఆత్మీయంగా ఉంటున్న వారు మరణంలో కూడా విడిపోలేదు. మహారాష్ట్రలోని సిరొంచలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలకేంద్రానికి చెందిన ఎండీ రహీం (22), జాబ్రీ అర్బాజ్(21) చనిపోయారు. చికిత్స పొందుతూ రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు కన్నుమూశారు. స్థానికుల కథనం ప్రకారం.. రహీం, అర్బాజ్ మహదేవపూర్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ జీవనోపాధి పొందుతుండేవారు. ఇటీవల అర్బాజ్ కుటుంబం మంచిర్యాలకు షిఫ్ట్ అయ్యింది. దీంతో అర్బాజ్.. రహీంను కలవడానికి మహదేవపూర్‌కు వచ్చిపోతుండేవాడు. ఈ క్రమంలో అర్బాజ్, రహీం ఈనెల 18న మహారాష్ట్రలోని సిరొంచలో ఉర్సు ఉత్సవాలకు వెళ్లారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున (19వ తేదీన) మహదేవపూర్‌కు వస్తుండగా చింతలపల్లి వద్ద బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన స్థానికులు మొదట ఎంజీఎం .. అక్కడి నుంచి హైదరాబాద్‌గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రహీం బుధవారం, అర్బాజ్ గురువారం మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాలతోపాటు మహదేవపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, రహీం కుటుంబానికి గురువారం జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలిద్దాం

● హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్



మాట్లాడుతున్న హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్

హన్మకొండ: మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన కోసం అందరం కలిసి పని చేద్దామని హనుమకొండ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని 'అనంత' భవన్‌లో ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనపై వర్క్‌షాపు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాథోడ్ రమేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ మూలాలు, కారణాలను తెలుసుకుంటూ సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వాలన్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మానవ అక్రమరవాణా తీరుతెన్నులు, నిర్మూలనపై వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎంఎం సాంఘిక సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, హనుమకొండ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్ రావు, హైదరాబాద్ ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి మేరక మణి, మాజీ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ కె.అనితారెడ్డి, చైర్మన్ మండల పరశురాములు, హనుమకొండ జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతోనే వ్యక్తి హత్య

● నిందితుడు ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు అరెస్ట్
● వివరాలు వెల్లడించిన ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన హత్య కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం సుబేదారి పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మడికొండకు చెందిన నిందితుడు ఏనుగు వెంకటేశ్వర్లు, మాచర్ల రాజుకుమార్(42) ఆటోలు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మడికొండకు చెందిన ఓ మహిళతో ఇద్దరూ వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంకటేశ్వర్లు.. రాజుకుమార్‌ను ఎలాగైనా చంపాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 11.40 గంటలకు రాజుకుమార్ తన ఆటోలో హనుమకొండ నుంచి మడికొండకు వెళ్తున్నాడు. నిందితుడు వెంకటేశ్వర్లు అదాలత్‌లోని డీమార్ట్ ఎదురుగా రాజుకుమార్‌ను అడ్డగించి గొడవ పడి కత్తితో పొడిచి చంపి పరారయ్యాడు. సదరు మహిళతో ఉన్న వివాహేతర సంబంధం కారణంగా ఇద్దరి మధ్య వారం క్రితం గొడవ జరిగింది. దీంతో రాజ్‌కుమార్‌ను ఎలాగైనా కడతేర్చాలని నిర్ణయించుకున్న నిందితుడు వెంకటేశ్వర్లు.. అదును కోసం ఎదురు చూసి రాజ్‌కుమార్‌ను హత్య చేసినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పంటకు నీరు పారిస్తూ మృత్యుఒడికి..

● విద్యుత్‌షాక్‌తో మహిళా రైతు మృతి
● అబ్బాపురంలో ఘటన



రజిత మృతదేహంపై పడి రోదిస్తున్న కుమార్తె

ములుగు రూరల్ : ఓ మహిళా రైతు పంటకు నీరు పారిస్తూ మృత్యుఒడికి చేరింది. జంతువుల బారి నుంచి పంటను కాపాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని అబ్బాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని జాకారం గ్రామానికి చెందిన పూజారి రజిత(40),రమేశ్ దంపతులు అబ్బాపూర్ శివారులో కొంత భూమిని కౌలు తీసుకొని మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పంటను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు రమేశ్ పంట చుట్టూ బైడింగ్ వైర్‌ను అమర్చాడు. రాత్రి సమయంలో కరెంట్ సరఫరా ఇచ్చి ఉదయమే తొలగించేవాడు. ఈ క్రమంలో గురువారం పొలం వద్దకు వెళ్లిన రజిత.. విద్యుత్ సరఫరాను తొలగించారని భావించి మొక్కజొన్న పంటకు నీరు పారిస్తోంది. నీటి ప్రవాహంలో విద్యుత్ సరఫరా కావడంతో తప్పించుకునే యత్నం చేసి బైండింగ్ తీగపై పడగా షాక్‌కు గురై మృతి చెందింది. చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఘటనా స్థలికి చేరుకుని మృతికి గల కారణాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.



● ఇంగ్లీష్ ఇడియమ్స్

లెట్ ది డస్ట్ సెటిల్

ఒక సంక్షోభం తరువాత లేదా గందరగోళం తరువాత వచ్చే సమయం కోసం ఎదురుచూసే సందర్భంలో వాడే మాట...లెట్ ది డస్ట్ సెటిల్.

ఉదా: ది కంపెనీ ఈజ్ ఫేసింగ్ క్రిటిసిజమ్ నౌ, బట్ దే ఆర్ వెయిటింగ్ టు లెట్ ది డస్ట్ సెటిల్ బిఫోర్ మేకింగ్ ఏ స్టేట్‌మెంట్

● మ్యూజిక్ వరల్డ్

మదిని దోచేలా మైమరచి పోయేలా!



అమెరికన్ సింగర్–సాంగ్ రైటర్ గ్రేసీ అబ్రామ్స్ రాసిన పాట 'దట్ ఈజ్ సో ట్రూ' బిల్‌బోర్డ్ జాబితాలో అగ్ర స్థానంలో ఉంది. ఇది గ్రేసీ రెండవ ఆల్బమ్. అమెరికాకు వెలుపల ఆస్ట్రేలియా, బెల్జియం, న్యూజీలాండ్, నార్వే, యునైటెడ్ కింగ్ డమ్, ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడన్, స్విట్జర్లాండ్‌లో మ్యూజిక్ చార్ట్‌లలో అగ్ర స్థానంలో నిలిచింది. 'ఐ కుడ్ గో అండ్ రీడ్ యువర్ మైండ్' అని హుషారెత్తిస్తోంది. ఆ సందడిలో మీరు భాగం కావాలంటే....'దట్ ఈజ్ సో ట్రూ' ఒక్కసారి వినేయండి. 'షీ ఈజ్ సో కూల్' అంటూ గ్రేసీతో గొంతు కలపండి.

● గేమింగ్

స్పైడర్–మ్యాన్ మరోసారి...

గ్రేట్ సూపర్ హీరోలా సాహసాలు ఎప్పుడూ సూపర్‌గానే ఉంటాయి. దీనికి ఉదాహరణ... స్పైడర్–మ్యాన్!

ఒక్క ముక్కలో చెప్పాలంటే స్పైడర్–మ్యాన్ గేమ్స్ ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్. 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్ 2' యాక్షన్ అడ్వెంచర్ గేమ్. మార్వెల్ కామిక్స్ క్యారెక్టర్ 'స్పైడర్–మ్యాన్' ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. థర్డ్ పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో పీటర్ పార్కర్, మైకేల్ మోరేల్స్ ప్రధాన పాత్రలు. న్యూయార్క్ కేంద్రంగా సాగే ఈ ఆటలో ప్లేయర్స్ రకరకాల స్పైడర్–మ్యాన్ సూట్‌లను సేకరించవచ్చు.

సమస్త సాహసాలతో గేమింగ్ కమ్యూనిటీని ఆకట్టుకునే 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్' ఈ నెల చివర రానుంది.



సిరీస్: మార్వెల్స్ స్పైడర్–మ్యాన్
ప్లాట్‌ఫామ్స్: విండోస్
జానర్: యాక్షన్–అడ్వెంచర్
మోడ్: సింగిల్–ప్లేయర్



● రికార్డ్

ప్రయాణ ప్రేమికుడు, ప్రఖ్యాత పర్వతారోహకుడు సర్ మార్టిన్ కాన్వే 'అధిరోహించిన ప్రతి శిఖరం ఏదో ఒకటి నేర్పుతుంది' అంటారు. అలా చిన్న వయసులోనే ఎన్నో శిఖరాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంది విశాఖపట్నానికి చెందిన కామ్య కార్తికేయన్. పదహారేళ్లకే ఎవరెస్ట్ అధిరోహించి రికార్డ్ సృష్టించింది. తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసిన యంగెస్ట్ ఫిమేల్‌గా రికార్డు సృష్టించింది....

కామ్య... అఖండ ఖ్యాతి

ఇలా మొదలైంది...

కార్తికేయన్, లావణ్య దంపతులకు సాహస యాత్రలు ఇష్టం. తమ చిన్నారి కామ్యను భుజాలపై మోసుకుంటూనే ట్రెక్కింగ్‌కు వెళుతుండేవారు. అలా పర్వత శిఖరాలతో చిన్నవయసులోనే కామ్యకు పరిచయం అయింది. మూడేళ్ల వయసులోనే ముంబైలోని లోనావాలాలో తండ్రితో పాటు ట్రెక్కింగ్‌లో పాల్గొని 'శభాష్' అనిపించుకుంది. మహారాష్ట్రలోని డ్యూక్స్ నోస్, రాజ్ గడ్ పర్వతాల్ని నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అధిరోహించింది.

తల్లికి తగిన తనయ...

హిమాలయాల ట్రెక్కింగ్‌కు తల్లితో పాటు వెళ్లింది కామ్య. అప్పుడు ఆమె వయసు ఏడేళ్లు. తల్లీ కూతుళ్లు మొదటి ప్రయత్నంలోనే 12 వేల అడుగుల ఎత్తైన చంద్రశీల పర్వతారోహణ చేశారు. ఆ తర్వాత హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒకటైన 13,500 అడుగుల ఎత్తైన హర్‌కిదమ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. అది పూర్తి చేసిన కొద్ది రోజుల్లోనే 13,500 అడుగుల ఎత్తైన కేదార్‌కంఠ పర్వతారోహణ చేశారు.

తొమ్మిదేళ్ల వయసులో హిమాలయాల్లో రూప్‌కుండ్ ట్రెక్కింగ్ చేసి రికార్డు సృష్టించింది కామ్య.

ప్రధాని మన్ కీ బాత్‌లో కామ్య...

'అవరోధాల్ని అధిగమించి మన ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేయాలి అనుకునేవారికి విశాఖ నగరానికి చెందిన కామ్య కార్తికేయన్ అనే చిన్నారి స్ఫూర్తినిచ్చింది' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ కామ్యను ప్రశంసించారు. దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన సమయంలో మన్‌కీ బాత్‌లో కామ్య ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ.

– కరుకోల గోపీకిశోర్‌రాజా, సాక్షి, విశాఖపట్నం

ఆల్ రౌండర్

ముంబై నేవీ స్కూల్‌లో ప్లస్‌టు చదువుతున్న కామ్య కార్తికేయన్ పర్వతారోహణలోనే కాదు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్రతి పరీక్షలోనూ ఫస్ట్ గ్రేడ్ సాధిస్తోంది. సంగీతంలోనూ ప్రావీణ్యం పొందిన కామ్య పియానో వాయిద్యానికి సంబంధించి 3 గ్రేడులు పాసైంది. కర్ణాటక సంగీతం, భరతనాట్యంలోనూ 'ఆహా' అనిపించేలా ప్రతిభ చూపుతోంది.

ఏడు ఖండాల్లో ఎన్ని రికార్డ్‌లో!

● దక్షిణ అమెరికాలో 22,837 అడుగుల ఎత్తైన మౌంట్ అకాన్‌కాగువాని అధిరోహించి ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది ● ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన 18,652 అడుగుల మౌంట్ కిలిమంజారోపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి ఈ శిఖర యాత్ర పూర్తి చేయించడం ద్వారా ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డు ● యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్‌బ్రస్‌ని అధిరోహించి యంగెస్ట్ గర్ల్ ఇన్‌ది వరల్డ్‌గా రికార్డు ● ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు ● ఉత్తర అమెరికాలోని 20,308 అడుగుల మౌంట్ దెనలీని అధిరోహించిన యంగెస్ట్ నాన్ అమెరికన్‌గా రికార్డు ● ఆసియా ఖండంలో అత్యంత ఎత్తైన 29,031 అడుగుల మౌంట్ ఎవరెస్ట్‌ని అధిరోహించి నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్‌ని అధిరోహించి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి, ప్రపంచంలోనే అతి పిన్నవయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది.

ప్రతి అడుగూ సవాల్‌గా స్వీకరించాను

సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసి భారత త్రివర్ణపతాకాన్ని ఏడు ఖండాల్లోనూ రెపరెపలాడించాలన్నదే అమ్మా నాన్నల కల. వారి ఆకాంక్ష నెరవేర్చినందుకు గర్వంగా ఉంది. ఒకానొక సమయంలో మా పేరెంట్స్ తమ సంపాదనంతా నా మీదే ఖర్చు చేశారు. కొందరు దాతలు సహకారం అందించి నన్ను ముందుకు నడిపించారు. ఎంతటి కష్టాన్నైనా అవలీలగా ఎదుర్కోవాలన్నది నాన్న దగ్గర నేర్చుకున్నాను.

– కామ్య కార్తికేయన్

యువర్స్

● టెక్.. టాక్

ఇన్‌స్టాలో ఎడిట్ యాప్



స్మార్ట్‌ఫోన్‌లలో షార్ట్ వీడియో క్రియేషన్ సరికొత్త స్థాయికి చేరుకుంది. క్రియేటర్స్‌కు దగ్గరైన ప్లాట్‌ఫామ్‌లలో ఇన్‌స్టాగ్రామ్ ఒకటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐఫోన్‌ల కోసం 'ఎడిట్' యాప్‌ను ప్రకటించింది ఇన్‌స్టా.

'అధిక నాణ్యతతో వీడియోను రికార్డ్ చేయడానికి, మీరు కోరుకునే అన్ని ఎడిటింగ్ సాధనాలు, ఫ్రెండ్స్‌తో పాటు ఇతర క్రియేటర్‌లతో డ్రాఫ్ట్‌ను షేర్ చేసే సామర్థ్యం ఎడిట్‌లో ఉంటాయి. ఎడిట్ అనేది క్రియేటివ్ టూల్స్ సమాహారం' అని ప్రకటించాడు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మొస్సేరి.

'ఎడిట్స్' యాప్‌ను ఉపయోగించడం వల్ల యూజర్‌లు వాటర్ మార్క్ లేకుండా వీడియోలను ఎక్స్‌పోర్ట్ చేయడానికి, వీడియోల పనితీరును విశ్లేషించడానికి...మొదలైన వాటికి ఉపయోగపడుతుంది. ఈ యాప్ 2కె రిజల్యూషన్ నుంచి 60 ఎఫ్‌పిఎస్ వరకు హెచ్‌డీఆర్, ఎస్‌డీఆర్ ఫార్మాట్‌లో ఎడిటింగ్ వీడియోలను సపోర్ట్ చేస్తుంది.

ఇక మూడు నిమిషాలు!



యూట్యూబ్ షార్ట్స్ మాదిరిగానే మూడు నిమిషాల నిడివి గల వీడియోలను ప్లాట్‌ఫామ్‌లో అప్లోడ్ చేయవచ్చని తెలియజేసింది ఇన్‌స్టాగ్రామ్. గతంలో 90 సెకన్‌ల వరకు వీడియోలను అప్లోడ్ చేసే అవకాశం కల్పించింది ఇన్‌స్టాగ్రామ్.

'ఇక నుంచి మీరు మూడు నిమిషాల నిడివి గల రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో లాంగ్–ఫామ్ వీడియోలపై కాకుండా షార్ట్–ఫామ్ వీడియోలపై దృష్టి పెట్టాలనుకున్నాం. కానీ 90 సెకనులు చాలా తక్కువ సమయం అని క్రియేటర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పెంచిన సమయం వల్ల మీరు మరిన్ని స్టోరీలను షేర్ చేయవచ్చు' అని ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది.



ఏసర్ స్విఫ్ట్ జో 14

స్క్రీన్ సైజ్: 14 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్: 2880×1800 పిక్సెల్స్
డైమెన్షన్స్: 312.9×217.9×14.9 ఎంఎం
బరువు: 1.25 కేజీ

ఓపెన్ ఏఐ టాస్క్స్



'టాస్క్స్' అనే న్యూ చాట్‌జీపీటి కేపబిలిటీతో ముందుకురానుంది ఓపెన్ ఏఐ. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. అలారం సెట్ చేయడం, ప్రజెంటేషన్ ఇవ్వడానికి అవసరమైన రాబోయే సమావేశాన్ని గుర్తు చేయడంలాంటి పనులను చేయగలదు. నీరు తాగడం నుంచి గ్రాసరీ షాపింగ్ వరకు ఎన్నో విషయాలలో 'టాస్క్స్' ద్వారా రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు.

సాక్షి సినిమా

హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్

– వెంకటేశ్



● భీమ్స్, వెంకటేశ్, అనిల్ రావిపూడి

''సంక్రాంతి పండగకి నిజాయతీగా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనుకున్నాం. ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని ఆదరించారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు. మా సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైంది. గురువారం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''అనిల్‌తో నేనో ఫ్రెండ్‌లానే ఉంటాను. మేము చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేస్తాం.. అందుకే రిజల్ట్ ఇంత పాజిటివ్‌గా ఉంటుంది. ఇక నా సినిమా ఇన్ని కోట్లు వసూలు చేయాలని నేనెప్పుడూ అడగను... వచ్చింది తీసుకోవాలి. ఇప్పటికే మా సినిమా రూ. 230 కోట్లు వసూలు చేయడం అనేది బోనస్.. ఇంతకంటే ఏం కావాలి'' అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ–''సినిమాకి కాస్త దూరమైన ప్రేక్షకులు కూడా మా 'సంక్రాంతికి వస్తున్నాం' కోసం థియేటర్‌కి రావడం ఆనందంగా ఉంది. రెవెన్యూ సైడ్ కూడా మేం ఊహించినదానికంటే అద్భుతంగా రావడం హ్యాపీ'' అని చెప్పారు. ''వెంకటేశ్‌గారి 'కలిసుందాం రా' సినిమా పాటలని ప్రేక్షకులు ఎంత గుండెల్లో పెట్టుకున్నారో... 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్‌ని కూడా అదే స్థాయిలో ఆస్వాదించడం సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు భీమ్స్ అన్నారు.



● సాయిపల్లవి, నాగచైతన్య

హైలెస్సో హైలెస్సా

'హైలెస్సో హైలెస్సా...' అంటూ ఆడి పాడేస్తున్నారు నాగచైతన్య, సాయిపల్లవి. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'హైలెస్సో హైలెస్సా... నీవైపే తెరచాపని తిప్పేసా...' అంటూ సాగే మూడో పాటని గురువారం రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని శ్రేయా ఘోషల్, నకాష్ అజీజ్ పాడారు. ''మోస్ట్ ఎవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'తండేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'బుజ్జి తల్లి..', 'నమో నమః శివాయ...' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. వండర్‌ఫుల్ మెలోడీస్‌ని కంపోజ్ చేయడంలో మాస్టర్ అయిన దేవిశ్రీ ప్రసాద్ తాజాగా 'హైలెస్సో హైలెస్సా..' అంటూ సాగే మరొక లవ్ మెలోడీని కంపోజ్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది

– విశ్వక్ సేన్



● సాహు గారపాటి, విశ్వక్ సేన్, రామ్ నారాయణ్

''నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో రూపొందిన ఔట్ అండ్ ఔట్ కామెడీ ఫ్యామిలీ ఫిల్మ్ 'లైలా'. చాలా క్లీన్‌గా ఉంటుంది. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా కోసం లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది. నిజంగా అమ్మాయిలకు హ్యాట్సాఫ్ చెప్పాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, ఆకాంక్ష శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఇచ్చుకుందాం బేబీ...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటని ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసి ఆలపించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''లైలా'లో మోడల్ సోనూ, లైలా అనే రెండు పాత్రల్లో నటించా'' అన్నారు. ''లైలా' కథ ఇద్దరు ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి ఉంటేనే చేయగలరు. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ దొరికారు'' అని రామ్ నారాయణ్ చెప్పారు. ''ఈ పాత్ర విశ్వక్ కెరీర్‌లో నిలిచిపోతుంది'' అన్నారు సాహు గారపాటి. పాటల రచయిత పూర్ణాచారి మాట్లాడారు.




● కార్లా సోఫియా గ్లాస్కాన్

97వ ఆస్కార్ అవార్డ్ నామినేషన్స్ ప్రకటన

ఆస్కార్ సంబరం ఆరంభం





● 13 నామినేషన్లతో నాన్ ఇంగ్లీష్ మూవీ 'ఎమిలియా పెరెజ్' రికార్డ్
● 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు 10 నామినేషన్స్
● ట్రాన్స్‌జెండర్‌కి దక్కిన తొలి నామినేషన్ ● ఇండియన్ షార్ట్ ఫిల్మ్‌కి నామినేషన్

97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఈ ఏడాది మార్చి 2న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరగనుంది. కాగా ఈ అవార్డులకు సంబంధించిన నామినేషన్లను గురువారం రాత్రి (భారతీయ కాలమానం ప్రకారం) ప్రకటించారు. అమెరికన్ నటుడు బోవెన్ యాంగ్, నటి రాచెల్ సెన్నాట్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయితే ఈ నామినేషన్ల ప్రకటన ఈ నెల 17న జరగాల్సింది. కానీ అమెరికాలో చెలరేగిన కార్చిచ్చు కారణంగా 19కి వాయిదా వేశారు. ఫైనల్‌గా 23న ప్రకటించారు.

రికార్డ్ సాధించిన స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్

ఈసారి స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్ మూవీ 'ఎమిలియా పెరెజ్' నాన్–ఇంగ్లీష్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని రికార్డ్ సాధించింది. గతంలో చైనా మూవీ 'క్రౌచింగ్ టైగర్ హిడెన్ డ్రాగన్', మెక్సికన్–అమెరికన్ డ్రామా 'రోమా'... ఈ రెండు చిత్రాలు నాన్–ఇంగ్లీష్ విభాగంలో పది నామినేషన్లు దక్కించుకున్నాయి. ఇప్పుడు 13 నామినేషన్లతో 'ఎమిలియా పెరెజ్' వాటిని అధిగమించింది. అలాగే ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్‌లో నటించిన స్పానిష్ నటి కార్లా సోఫియా గాస్కాన్ (బెస్ట్ యాక్ట్రస్ లీడ్ రోల్ నామినేషన్) చరిత్ర సృష్టించారు. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన తొలి ట్రాన్స్‌జెండర్ నటిగా నిలిచారామె. ఇంకా 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు పది నామినేషన్ల చొప్పున దక్కాయి. అంతగా అంచనాలు లేని 'కాన్‌క్లేవ్' మూవీకి 8 నామినేషన్లు దక్కడం ఓ విశేషం.

ఒక్క నామినేషన్ తేడాతో... నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని, రికార్డు సాధించిన 'ఎమిలియా పెరెజా'కి ఇంకో నామినేషన్ దక్కి ఉంటే... ఇంగ్లీష్ ఫిల్మ్‌ల రికార్డుని కూడా అధిగమించి ఉండేది. 'టైటానిక్, ఆల్ అబౌట్ ఈవ్, లా లా ల్యాండ్' వంటి ఇంగ్లీష్ చిత్రాలు 14 నామినేషన్లు దక్కించుకున్నాయి.



తల్లి హిస్టరీ రిపీట్: 'ఐయామ్ స్టిల్ హియర్' చిత్రానికి గాను ఫెర్నాండా టోర్రెస్ ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్నారు. ఇందులో విశేషం ఏంటంటే... ఆమె తల్లి ఫెర్నాండా మోంటెనెగ్రో 1991లో 'సెంట్రల్ స్టేషన్' చిత్రానికి గాను ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి బ్రెజిలియన్ నటిగా రికార్డుని సాధించారు. ఇప్పుడు ఇన్నేళ్లకు మలి బ్రెజిలియన్ నటిగా టోర్రెస్ నామినేషన్ దక్కించుకుని తల్లి హిస్టరీని రిపీట్ చేశారు.

బరిలో ఇండియన్ షార్ట్ ఫిల్మ్: ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించిన 'అనూజ' బెస్ట్ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఆల్రెడీ రెండు ఆస్కార్ అవార్డులు సాధించిన భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఈ చిత్రానికి ఓ నిర్మాత కావడం విశేషం. అలాగే నటి ప్రియాంకా చోప్రా ఓ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఢిల్లీలోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేసే తొమ్మిదేళ్ల అనూజ స్కూల్‌కు వెళ్లాలనుకుంటుంది. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని, అనూజ సోదరి పాలక్ భవిష్యత్‌ను ఏ విధంగా ప్రభావితం చేసింది? అనే కోణంలో ఈ చిత్రం సాగుతుంది. అనూజగా సజ్దా పఠాన్, పాలక్‌గా అనన్య షాన్‌భాగ్ నటించారు. ఇదిలా ఉంటే... గునీత్ మోంగా ఓ నిర్మాతగా వ్యవహరించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కి గాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 2023లో ఆస్కార్ దక్కింది. అంతకుముందు 2021లో గునీత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్'కిగాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డు దక్కింది. ఇప్పుడు ఆమె ఓ నిర్మాతగా వ్యవహరించిన 'అనూజ'కు కూడా ఆస్కార్ దక్కుతుందా? అనేది చూడాలి.

ఉత్తమ చిత్రం: అనోరా, ది బ్రూటలిస్ట్, ఎ కంప్లీట్ అన్‌నోన్, కాన్‌క్లేవ్, డ్యూన్: పార్ట్ 2, ఎమిలియా పెరెజ్, ఐయామ్ స్టిల్ హియర్, నికెల్ బాయ్స్, ది సబ్‌స్టాన్స్, విక్డ్ ● **ఉత్తమ దర్శకుడు:** సీన్ బేకర్ (అనోరా), బ్రాడీ కార్బెట్ (ది బ్రూటలిస్ట్), జేమ్స్ మ్యాన్‌గోల్డ్ (ది కంప్లీట్ అన్‌నోన్), జాక్వెస్ ఆడియార్డ్ (ఎమిలియా పెరెజ్), కోరలీ ఫార్గేట్ (ది సబ్‌స్టాన్స్) ● **ఉత్తమ నటుడు:** అడ్రియాన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్), తిమోతీ చాలమెట్ (ది కంప్లీట్ అన్‌నోన్), కోల్‌మెన్ డొమినింగో (సింగ్‌సింగ్), రేఫియన్నెస్ (కాన్‌క్లేవ్), సెబస్టియన్ స్టాన్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ నటి:** సింథియా ఎరివో (విక్డ్), కార్లా సోఫియా గాస్కన్ (ఎమిలియా పెరెజ్), మికే మాడిసన్ (అనోరా), డెమి మూర్ (ది సబ్‌స్టాన్స్), ఫెర్నాండా టోర్రెస్ (ఐ యామ్ స్టిల్ హియర్) ● **ఉత్తమ సహాయ నటుడు:** యురా బోరిసోవ్ (అనోరా), కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), ఎడ్వర్డ్ నార్టన్ (ది కంప్లీట్ అన్‌నోన్), గాయ్ పియర్స్ (ది బ్రూటలిస్ట్), జెరీమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ సహాయ నటి:** మోనికా బార్బరో (ది కంప్లీట్ అన్‌నోన్), అరియానా గ్రాండే (విక్డ్), ఫెసిలిటీ జోన్స్ (ది బ్రూటలిస్ట్), ఇసబెల్లా రోస్సెల్లిని (కాన్‌క్లేవ్), జోయా సాల్దానా (ఎమిలియా పెరెజ్).

భారతీయ సినిమాకి నిరాశ

ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో నిలిచిన భారతీయ చిత్రాలు 'కంగువ, ఆడు జీవితం ('ది గోట్ లైఫ్), సంతోష్, స్వతంత్రవీర్ సవార్కర్, ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్, గర్ల్స్ విల్ బీ గర్ల్స్, పుతల్' ఆస్కార్ నామినేషన్‌ను దక్కించుకోలేకపోయాయి. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం ఈ ఏడాది ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పంపిన హిందీ చిత్రం 'లాపతా లేడీస్' ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లోనూ చోటు దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. ఇలా ఈసారి భారతీయ సినిమాకి నిరాశ ఎదురైంది.